

డ్యూటీ అదనం..సిబ్బంది బద్నాం

యాజమాన్యం వేధింపులతో టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. డబుల్ డ్యూటీలు చేసినా కనికరం చూపడం లేదని వాపోతున్నారు. - 8లో▸



బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయి..

బెట్టింగ్ యాప్‌ల కారణంగా నష్టపోయిన ఓ వ్యక్తి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగగా మారాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31°/22°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో మంచు కురుస్తుంది.

కార్డులెప్పుడు?

ఫ్యామిలీ డిజిటల్ రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు

- పెండింగ్‌లో 72,104 దరఖాస్తులు
- ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు పైలెట్ ప్రాంతాల్లో ముగిసిన సర్వే
- మిగతా ప్రాంతాల్లో మొదలు కాని వివరాల సేకరణ
- ఎప్పుడు చేస్తారో కూడా చెప్పలేని పరిస్థితి..



పరకాల మున్సిపాలిటీ రెండో డివిజన్‌లో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలా..

మొత్తం కార్డులు : 11,05,543 (ఆహారభద్రత+అంత్యోదయ+అన్నపూర్ణ)
మొత్తం యూనిట్లు (కుటుంబసభ్యులు) : 32,55,776
మండల స్థాయి స్టాక్ పాయింట్లు : 18
మొత్తం రేషన్ దుకాణాలు: 2,364
ప్రతీనెల రేషన్ బియ్యం పంపిణీ : 33,153.976 మె.టన్నులు

సాక్షి ప్రతినిధి, వరంగల్:

కొత్త రేషన్‌కార్డులతో ప'రేషన్' తప్పుతుందని భావించిన ఆశావహులకు ఎదురుచూపులు తప్పడం లేదు. పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే చేసేందుకు ఉమ్మడి వరంగల్‌లోని ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక మండలంలోని ఓ గ్రామం, ఓ మున్సిపాలిటీ వార్డును ఎంపిక చేశారు. ఈ నెల 3 నుంచి 7 వరకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు బృందాలుగా సర్వే పూర్తి చేశారు. ఆ తర్వాత మూడు నెలల వ్యవధిలో కొత్త కార్డులు జారీ చేసేందుకు వీలుగా అన్ని ప్రాంతాల్లో సర్వే ప్రక్రియ ముగించనున్నట్లు ప్రకటించారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ముగించిన అధికారులు.. మిగతా గ్రామాల్లో ఎప్పటి నుంచి చేయనున్నారో ఇంకా షెడ్యూల్ ఇవ్వలేదు. దీంతో ఈ ప్రక్రియ ఎప్పుడు ముగుస్తుంది? డిజిటల్ రూపంలో కొత్త కార్డులు ఎప్పుడు అందుతాయి? అన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కుటుంబాల సర్వే పూర్తి చేసి త్వరలోనే కార్డులు అందజేసే ప్రక్రియ జరుగుతున్నదని అధికారులు చెబుతున్నారు.

కొత్త రేషన్ కార్డులకు ఎదురుచూపులు...

ఉమ్మడి వరంగల్‌లో కొత్త కార్డుల కోసం సుమారు 72,104 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు రెండు నెలల కిందట అధికారులు ప్రకటించారు. పౌరసరఫరాల సంస్థ గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 11,05,543 కార్డుల ద్వారా 32,55,776 మంది కుటుంబసభ్యులు 33,153.976 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ప్రతీనెల పొందుతున్నారు. సుమారు ఐదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేయక పోగా.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించి కూడా కొత్తగా ఎవరికీ ఇవ్వలేదు. 'ప్రజాపాలన' కార్యక్రమంలో తెల్ల కాగితాలపై దరఖాస్తులు ఆహ్వానించినా పరిష్కరించలేదు. కొత్త రేషన్‌కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసి, సర్వేతోపాటు ఫ్యామిలీ డిజిటల్‌కార్డుల జారీకి ఆదేశాలిచ్చింది. ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం.. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని సూచించినా ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

వివరాలు తీసుకున్నరు.. ఇంకా ఏమీ చెప్పలే

అధికారులు మా గ్రామంలో కూడా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. డిజిటల్ సర్వేలో కుటుంబ సభ్యుల సంఖ్య, వివరాలను సేకరించడంతోపాటు మా గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కుటుంబంలో కుమారులకు పెళ్లి అయినట్లయితే వేరుగా వివరాలను నమోదు చేశారు. ఆధార్ కార్డుల నంబర్, పుట్టిన తేదీ వివరాలు అడిగారు. రేషన్ కార్డు ఉందా లేదా? అని కనుక్కొని వెళ్లారు. ఇంకా ఏమీ చెప్పలేదు.

– కుమ్మిత లలిత, పొట్లాపూర్



అధికారుల పర్యవేక్షణ లేకుండా అర్ధరాత్రి జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

పట్టణాభివృద్ధిపై పట్టింపేది?

13 ఏళ్ల మున్సిపాలిటీ..
10 మంది కమిషనర్లు!

- పెరగని ఆదాయం.. కనీస వసతులు కరువు!
- కొరవడిన ఇన్‌చార్జ్ కమిషనర్ల పర్యవేక్షణ
- అధ్వానంగా శానిటేషన్ వ్యవస్థ



రోడ్డుపై చెత్తను కాల్చివేసిన మున్సిపల్ సిబ్బంది

పరకాల: పాలకులకు నచ్చినట్లు ఉండాలి.. లేదంటే పోవాలి.. అన్నట్లుగా మారింది పరకాల మున్సిపాలిటీ కమిషనర్ సీటు. 13 ఏళ్ల పరకాల మున్సిపాలిటీలో 10 మంది కమిషనర్లు మారారు. వారిలో ఇద్దరు మాత్రమే చెరో మూడేళ్లు విధులు నిర్వహించారు. మిగతా ఏడుగురులో ఏ ఒక్కరూ ఏడాది పని చేయకుండానే బదిలీ అవడం చర్చనీయాంశంగా మారింది. అసలే ఆదాయం లేని పరకాల మున్సిపాలిటీకి కమిషనర్లు రావడం.. పోవడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందనే విమర్శలున్నాయి. 2011లో నగర పంచాయితీగా ఉన్న పరకాల మున్సిపాలిటీగా మారింది. మొదట 20 వార్డులు ఉండగా.. రెండు గ్రామాలు రాజీపేట, సీతారాంపూర్ విలీనంతో 22 వార్డులకు విస్తరించింది. మున్సిపాలిటీ విలీనంతో సంబురపడ్డ రెండు గ్రామాల ప్రజలపై పన్నుల భారం తప్ప.. అభివృద్ధి కరువైంది. విధుల్లో నిర్లక్ష్యం కారణంగానే కమిషనర్‌లు బదిలీ అవుతున్నట్లు పాలకవర్గ సభ్యులు పేర్కొంటున్నారు. మరో వైపు పాలకుల మాట వినకపోతే బదిలీలు సాధారణమే అన్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.

కరువైన ప్రణాళిక..

13 ఏళ్ల పరకాల మున్సిపాలిటీలో ఇద్దరు బి.ఇంద్రాసేనారెడ్డి, టి.శేషాంజన్‌స్వామి మినహా మిగతా కమిషనర్లంతా ఏడాది కూడా విధులు నిర్వహించకుండా బదిలీ అవడంతో ఓ ప్రణాళిక కరువై పరకాల మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడుతుందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. అస్తవ్యస్థమైన డ్రెయినేజీ, శానిటేషన్‌లో వెనుకబడిపోతోంది. పదే.. పదే కమిషనర్లు మారడం వల్ల కొందరు ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జ్ కమిషనర్లు శానిటేషన్ పర్యవేక్షణ చేయకుండా కార్యాలయానికి రావడం.. పోవడం చేస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకున్న సందర్భాలు లేవు.

పదేళ్లలో పెరగని ఆదాయం

పదేళ్ల కాలంలో పరకాల మున్సిపాలిటీ ఆదాయం కొంత మేరకే పెరిగింది. 2014లో రూ.1.50 కోట్లు ఉన్నప్పటికీ 2024లో రూ.2.19 కోట్లకు మాత్రమే ఆదాయం పెరిగింది. తరచూ కమిషనర్లు మారుతుండడం వల్ల ఆదాయం పెంపుపై సరైన ప్రణాళిక లేకపోవడం కూడా కారణమవుతోంది. మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయమైన మార్కెట్ టెండర్ ప్రక్రియలో(సిండికేట్) గోల్‌మాల్ జరుగుతోంది. ఈవిషయంపై కూడా కొత్తగా వచ్చిన అధికారులకు అవగాహన లేకపోవడం వల్ల బకాయిలు పెరిగిపోతున్నాయి.

అధికారులపై పాలకుల పెత్తనం



పరకాల మున్సిపల్ కమిషనర్లు పదే పదే మారడం వల్ల ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారుతున్నాయి. అధికారులపై పాలకుల పెత్తనం తగ్గించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులు, సిబ్బందిని మందలించే అవకాశం లేకుండా పోతోంది. అధికారుల విధుల్లో కొందరు ప్రజాప్రతినిధుల జోక్యం చివరికి బదిలీలకు దారితీస్తోంది.

– మడికొండ రఘుపతి, ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు

న్యూస్‌రీల్

ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువును మరోసారి పొడిగించారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా నవంబర్ 6 వరకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు. అలాగే రూ.50 అపరాధ రుసుముతో నవంబర్ 11 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



వరంగల్ లీగల్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ క్షమాదేశ్ పాండే అన్నారు. మంగళవారం నగరంలోని బాలరక్షా భవన్‌లో వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ఐసీడీఎస్ అధికారులతో 'బాల్యపు శ్రమను కలిసికట్టుగా నిర్మూలిద్దాం' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ.. బాలల పరిరక్షణలో ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థల దృష్టికి తీసుకొచ్చి న్యాయ సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. అనంతరం వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ సాయికుమార్ మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థను నిరోధించడానికి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కోరారు. సదస్సులో హనుమకొండ, వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్లు అన్నమనేని అనిల్ చందర్‌రావు, కె.వసుధ, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు డాక్టర్ కె.గోపికారాణి, మేరుగు సుభాశ్, సభ్యులు ఆకులపల్లి మధు, సుజాత, రామలీల, శాహేద, దామోదర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జ్ అధికారి ప్రవీణ్‌కుమార్, లీగల్ ఆఫీసర్ రాచపల్లి సురేశ్, సీడీపీఓలు పాల్గొన్నారు.

హనుమకొండ డీఎండబ్ల్యూఓగా మురళీధర్‌రెడ్డి



న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా మైనారిటీల సంక్షేమశాఖ అధికారిగా డి.మురళీధర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సెరికల్చర్ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన(హనుమకొండ డిస్ట్రిక్ట్ మైనారిటీస్ వెల్ఫేర్ ఆఫీసర్)ను నియమిస్తూ మైనార్టీల సంక్షేమశాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు మహ్మద్ నయీముద్దీన్, ఇస్మాయిల్, తాజ్ దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ బాధ్యులు మహ్మద్ సలీం అహ్మద్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'డబ్బులిప్పిస్తే వెళ్లిపోతాం'

మామునూరు: సామాజిక మాధ్యమాల్లో ఆకర్షణీయ ప్రకటనలు చూసి మోసపోయామని, తాము ఫీజుల రూపేణా చెల్లించిన వేలాది రూపాయలు ఇప్పిస్తే ఇంటికి వెళ్లిపోతామని అయాన్ పోలీస్ అకాడమీ శిక్షణార్థులు అభ్యర్థిస్తున్నారు. మోసానికి పాల్పడిన అయాన్ పోలీస్ అకాడమీ నిర్వాహకుడు ఎండీ అన్వర్‌ను తక్షణమే అరెస్ట్ చేసి చట్ట ప్రకారం శిక్షించాలని మంగళవారం మామునూరు పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. నిరుద్యోగుల ఫిర్యాదుతో నిర్వాహకుడి తీరుపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

కలెక్టర్‌ను కలిసిన వరంగల్ డీఆర్‌ఓ విజయలక్ష్మి



కాజీపేట సెంటర్: వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి మంగళవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారదను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన విజయలక్ష్మిని వరంగల్ డీఆర్‌ఓగా నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి

ఎంపీ కడియం కావ్య



విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న ఎంపీ

ధర్మసాగర్: క్రీడలు జాతీయ సమైక్యతా భావాన్ని పెంచుతాయని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మండలంలోని కరుణాపురం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్పోర్ట్స్ మీట్ -2024 ముగింపు వేడుకలకు ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అత్యున్నత ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలను చేపడుతోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో స్టేషన్ ఘన్‌పూర్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను త్వరలో నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధతో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, ఆర్‌సీఓ రాజ్‌కుమార్, మనోహర్‌రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: జిల్లాలో పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా ప్రచురణ జాబితాను హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ వైవీ గణేశ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



ప్రదోషకాలంలో నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మూడోసారి బహుళ త్రయోదశి (ధన త్రయోదశి)ని పురస్కరించుకుని మంగళవారం ప్రదోష కాలంలో నందీశ్వరుడికి అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో రుద్రేశ్వరుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సూర్యాస్తమయం తర్వాత ప్రదోష కాలంలో మల్లికార్జున స్వామి గర్భాలయానికి ఎదురుగా ప్రతిష్టితమైన నందీశ్వరుడికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. నందీశ్వరుడికి వస్త్రధారణ చేసి, ధూపం వేసి గంధం బొట్టుపెట్టి అలంకరించారు. వేదోక్తంగా పూజించి పండ్లు ఫలాలతో నైవేద్యం సమర్పించారు. శనిగల ప్రసాదం నందీశ్వరుడి మూతికి కట్టి, వడమాలను మెడలో వేసి సమర్పించారు. అనంతరం ఏక కాలంలో నందీశ్వరుడికి, గర్భాలయంలో రుద్రుడికి నక్షత్ర హారతి సమర్పణ కార్యక్రమం కనులపండువగా జరిపించారు. అర్జిత సేవా టికెట్ భక్తులకు తీర్థప్రసాదాలు, స్వామి వారి శేష వస్త్రాలు అందజేశారు. ఈకార్యక్రమాన్ని వీక్షించి, పాల్గొన్న భక్తులకు ఎలాంటి దోషాలు ఉన్నా తొలిగి సకల గ్రహాలు ఉపశాంతిని పొంది వివాహం, సంతానం, ఆరోగ్యం తదితర సమస్యలు పరిష్కరించబడుతాయని పురాణాల్లో తెలుపబడినట్లుగా పండితులు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తమ దోషాలు తొలగించుకోవాలని ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు కోరారు. ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, అర్చకులు నందనం భాను ప్రసాద్, దేవేందర్, సాయిరామ్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల క్రీడల సమాఖ్య అండర్-14,17 బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ లో ఈత పోటీలు నిర్వహించారు. - వరంగల్ స్పోర్ట్స్ - 8లో▸

జిల్లాలో సమర్థంగా పశుగణన

కలెక్టర్ ప్రావీణ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలో పశు వైద్య, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన '21వ అఖిల భారత పశు గణన' కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు చేపట్టిన పశు గణన కార్యక్రమ పోస్టర్‌ను కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 138 రెవెన్యూ గ్రామాలతో పాటు పట్టణంలోని 57 వార్డుల్లో 68 మంది ఎన్యుమరేటర్లతో పశుగణన జరుపుతున్నట్లు తెలిపారు. ఎన్యుమనేటర్ల పని తీరును మండల స్థాయిలో సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి పశువులు, జంతువులు, రైతుల పూర్తి వివరాలపై ఆరా తీసి ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్లు, పశు గణన ద్వారా జిల్లాలో పశువుల లెక్క పక్కాగా తేలనుందని తెలిపారు. దీని ఆధారంగా సంబంధిత వ్యాక్సిన్లు, ప్రభుత్వ సబ్సిడీ దానా తదితరాలపై ప్రభుత్వాలు సులభంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్ నారాయణ, జిల్లా ఉప పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్, పశు వైద్యాధికారులు ప్రవీణ్, దీపిక, వినయ్, విక్రమ్, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ పరిశీలన



ఉప్పల్‌లో బాలికల హాస్టల్‌ను పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీలత

కమలాపూర్: శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్న ఉప్పల్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత మంగళవారం పరిశీలించారు. వివిధ దినపత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య హాస్టల్‌ను పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించడంతో బాలికల హాస్టల్‌ను శ్రీలత పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డీడీ శ్రీలత తెలిపారు. ఆమె వెంట ఏఎస్‌డబ్ల్యూఓ కృష్ణ, హాస్టల్ వార్డెన్ రేచల, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : నవంబర్ 6 నుంచి నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సర్వే ఉద్దేశ్యం, జిల్లా స్థాయిలో కలెక్టర్లు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు ప్రతీ మండలానికి ఒక జిల్లాస్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని, సర్వే నిర్వహణకు అవసరమైన ఫారాల మార్గదర్శకాలు ముద్రణ స్టేషనరీ ఏర్పాట్లు చేయాలని, ఇళ్ల జాబితా చేపట్టాలన్నారు. నల్లగొండ నుంచి వీసీలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లను ఆరా తీశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యాలత, సీపీఓ సత్యనారాయణరెడ్డి, డీపీఓ లక్ష్మీరమాకాంత్, డీఈఓ వాసంతి, పరకాల మున్సిపల్ కమిషనర్ నరసింహ పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి: కలెక్టర్

జిల్లాలో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సర్వే మార్గదర్శకాలపై వివిధ శాఖల అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎంపీఎస్‌ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నేడు (బుధవారం) మండల స్థాయిలో సర్వేకు సంబంధించి వివిధ అంశాలను తెలియజేసేందుకు ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సర్వే మార్గదర్శకాలపై శిక్షణ పొందిన అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

అసోసియేట్ ప్రొఫెసర్ ఇస్తారికి పేటెంట్ హక్కు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్తారికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 'ప్రతి అనులేఖనాన్ని నిరోధించడంలో ఎక్లిప్టా అల్బా మొక్కల పాత్ర' అనే అంశంపై పేటెంట్ హక్కు జారీ చేసింది. ఇస్తారి పర్యవేక్షణలో గతంలో డాక్టర్ లూనావత్ వెంకన్న పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఈ పరిశోధన ఫలితాలను 2022 అక్టోబర్‌లో ఇస్తారి పేటెంట్ హక్కుల కోసం భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయానికి దరఖాస్తు చేశారు. 2023లో దరఖాస్తులో పొందుపరిచిన వివరాలను పరిశీలించిన అనంతరం మంగళవారం భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం నుంచి ఈ పరిశోధనపై పేటెంట్ హక్కు పొందేందుకు అనుమతి ఇస్తున్నట్లు ఈ-మెయిల్ వచ్చింది. ఈ పేటెంట్ హక్కు 20 సంవత్సరాల వరకు ఉంటుందని సర్టిఫికెట్‌పై పొందుపరిచారు. ఈ సందర్భంగా ఇస్తారి, వెంకన్నను కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి తన చాంబర్‌లో పేటెంట్ సర్టిఫికెట్ అందజేస్తూ అభినందించారు. అకడమిక్ పరంగా పని చేసే వారిని యూనివర్సిటీ ఎప్పుడూ ప్రోత్సాహం ఇస్తుందన్నారు. కాగా, ఇస్తారి పర్యక్షణలో ఇప్పటి వరకు 12 మంది పీహెచ్‌డీ పూర్తిచేశారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డితో సహా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

డ్యూటీ అదనం.. సిబ్బంది బద్నాం



పనిభారం మోపుతున్న ఆర్టీసీ యాజమాన్యం

- అదనపు డ్యూటీలు చేసినా గైరాజరు వేస్తూ..
- మస్టర్ లేక జీతంలో కోత
- బస్సుల నిర్వహణలోనూ అసమర్థత
- ముందు చక్రాలకు రీ ట్రేడింగ్ టైర్లు
- ప్రమాదపుటంచున ప్రయాణం..
- అన్ని విధాలా కుంగిపోతున్న ఉద్యోగులు

హన్మకొండ: యాజమాన్యం వేధింపులతో టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. డబుల్ డ్యూటీలు చేసినా కనికరం చూపడం లేదని వాపోతున్నారు. విధులు నిర్వహించినా గైరాజరు వేస్తున్నారని వాపోతున్నారు. మస్టర్ లేక జీతంలో కోత పెడుతున్నారని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్-2 డిపో కార్మికులు మొత్తుకుంటున్నారు. దసరా సీజన్‌లో వరుస డ్యూటీలు చేసినా గైరాజరు వేసినట్లు డ్రైవర్, కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్-2 డిపో అధికారుల వేధింపులు భరించలేకపోతున్నామని, తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగం చేయాల్సి వస్తోందని, డ్యూటీ చేసినా అబ్‌సెంట్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ లోపం..

బస్సుల నిర్వహణలోనూ అసమర్థత నెలకొంది. ఆర్టీసీ బస్సులు ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తున్నాయి. ఏ వాహనానికైనా ముందు టైర్ నాణ్యతతో ఉంటుంది. టూ వీలర్ నుంచి మొదలుకుని భారీ వాహనాల వరకు ముందు చక్రాలు కండీషన్‌లో ఉండేలా చూసుకుంటారు. కానీ.. టీజీఎస్ ఆర్టీసీ మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది. సాధారణంగా బస్సులో 50 మందికి పైగా ప్రయాణించాలి. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ప్రస్తుతం ఒక్కో బస్సులో 100 మంది వరకు ప్రయాణిస్తున్నారు. వీరిని క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాలి. అయితే ఆర్టీసీ యాజమాన్యం వీరి ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ముందు చక్రాలకు రీట్రేడింగ్ టైర్‌లు వాడుతుండడంతో అవి ఎప్పుడు పేలుతాయో, ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో తెలియని భయాందోళనల మధ్య డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ములుగు దారిలో గట్టమ్మ సమీపంలో ఇరుకు రోడ్డులో బస్సుకు వేసినా రీ ట్రేడింగ్ టైర్ పగిలి బస్సు అదుపుతప్పింది. బస్ డ్రైవర్ అప్రమత్తమై ఎలాంటి ప్రమాదం జరుగకుండా జాగ్రత్త పడ్డారు. అదే సమయంలో పక్క నుంచి ఇసుక లారీ వెళ్తున్నది. ఇసుక లారీని ఢీ కొట్టాల్సి ఉండగా లారీ డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది. మరోవైపు డ్రైవర్లకు విశ్రాంతి ఇవ్వకుండా డ్యూటీల మీద డ్యూటీలు వేస్తున్నట్లు పలువురు ఆవేదన చెందుతున్నారు. రెస్ట్ రూంలో విశ్రాంతి తీసుకుంటున్నా.. కంట్రోలర్లు వచ్చి బలవంతంగా తీసుకెళ్లి డ్యూటీలు వేస్తున్నారని డ్రైవర్లు వారి గోడును వెళ్లబోసుకున్నారు. తగిన విశ్రాంతి లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముందని వారు పేర్కొంటున్నారు.

అధికారి ఆగ్రహావేశాలు..

వరంగల్-2 డిపో మేనేజర్ వ్యవహారశైలి తమకు అంతుబట్టడం లేదని ఆ డిపో కార్మికులు వాపోతున్నారు. ఏదైనా సమస్య ఉందని పరిష్కారం కోసం వెళ్తే.. తమపై అరుస్తున్నారని.. తమ బాధను వినడం లేదని వాపోతున్నారు. అధికారిని కలిసేందుకు మర్యాదగా యూనిఫాంలో వెళ్తే డ్యూటీ వదిలి ఎందుకు వచ్చావని, యూనిఫాం లేకుండా వెళ్తే యూనిఫాం లేకుండా వస్తావా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడుతున్నారని పలువురు ఉద్యోగులు తమ బాధను వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూ.. వారి బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత ఉన్న అధికారి తీరుతో తాము వేగలేక పోతున్నామని ఆర్టీసీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని గంటలకు మంగళం!

ఓటీల్లోనూ దోపిడీకి పాల్పడుతూ యాజమాన్యం తమను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టాన్ని చేకూరుస్తోందని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. రోజుకు 8గంటలు పనిచేయాల్సి ఉన్నా.. రోజుకు 12 గంటల చొప్పున వారం రోజులు డ్యూటీలు చేయిస్తున్నట్లు వాపోతున్నారు. కాగా యాజమాన్యం పోకడతో 50 ఏళ్లు దాటిన డ్రైవర్లు, కండక్టర్లు, మహిళా ఉద్యోగులు విపరీత ఆందోళనకు గురవుతున్నారు. కార్మిక చట్టం ప్రకారం వారానికి 48 గంటల పాటు మాత్రమే డ్యూటీ చేయాల్సి ఉండగా చట్టాలను ధిక్కరిస్తూ బలవంతంగా 72 గంటలు డ్యూటీ చేయిస్తున్నారని ఉద్యోగులు వివరించారు. వరంగల్ రీజియన్‌లోని అన్ని డిపోల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తమ గోడును యాజమాన్యం పట్టించుకోవడం లేదని, అధికారులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం

ఉద్యోగులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ఉద్యోగులను ఎలాంటి వేధింపులకు గురి చేయడం లేదు. డ్రైవర్ల అంగీకారం మేరకే డబుల్ డ్యూటీలు వేస్తున్నాం. బలవంతంగా డబుల్ డ్యూటీలు వేస్తున్నామని చెప్పడం సరికాదు. యూనిఫాం వేసుకుని వస్తే డ్యూటీ వదిలి ఎందుకు తన వద్దకు వచ్చారని ఎప్పుడూ అనలేదు. డ్యూటీ చేసిన వారికి గైరాజర్ వేయలేదు. ఎవరికైనా పొరపాటున గైరాజర్ పడితే తనను సంప్రదించాలి. ఉద్యోగులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు. నిర్భయంగా తనతో సమస్యలు చెప్పుకోవచ్చు.

- జ్యోత్స్న, వరంగల్-2 డిపో మేనేజర్

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: పాఠశాల క్రీడల సమాఖ్య అండర్-14,17 బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి స్విమ్మింగ్, హనుమకొండ జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కబడ్డీ ఎంపికలు నిర్వహించగా, బాలసముద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూ నాయక్ మాట్లాడుతూ స్విమ్మింగ్ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 80 మంది బాలబాలికలు హాజరయ్యారని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నవంబర్ 2,3,4 తేదీల్లో హైదరాబాద్ బాచుపల్లిలోని జియాన్ స్పోర్ట్స్ అకాడమీలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే, కబడ్డీ ఎంపిక పోటీలకు జిల్లాలోని 14 మండలాల నుంచి 28 టీమ్‌లు హాజరైనట్లు వివరించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన జట్లకు నేడు (30వ తేదీ) ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పంపనున్నట్లు తెలిపారు. నవంబర్ 3వ తేదీన మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంచాల స్వామిచరణ్, డీఎస్‌ఏ కోచ్‌లు రాయబారపు నవీన్‌కుమార్, కొత్త ప్రశాంత్, ఓనపాకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్ పోటీల్లో తలపడుతున్న బాలురు

సమన్వయంతో క్రీడా ఎంపికలు విజయవంతం

- డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్: జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ కోచ్‌లు, డీఎస్‌ఏ సిబ్బంది, క్రీడా సంఘాల బాధ్యుల సమన్వయంతోనే నాలుగు రోజుల పాటు సాగిన క్రీడా ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పాఠశాల క్రీడల సమాఖ్య అండర్-19 ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగు రోజులు 41 క్రీడాంశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లోఉమ్మడి జిల్లా నుంచి 3వేల పై చిలుకు క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. కోచ్‌ల సహకారంతో పోటీలను పారదర్శకంగా నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌ఏ కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు అశోక్ కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బరుపాటి గోపి, శ్రీనివాస్‌రెడ్డి, శీలం పార్థసారధి, ఫెన్సింగ్ సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బ రాము, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, కందికొండ రాజు, ఓనపాకల శంకర్, బొడ్డు విష్ణువర్ధన్, దేవిక తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న కోచ్‌లు, పీడీలు

వెడవెల్లి వెంకటరెడ్డి @100

- ఘనంగా మాజీ ఎమ్మెల్సీ శతవసంత పుట్టిన రోజు వేడుకలు

కురవి: సీరోలు మండల కేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్సీ వెడవెల్లి వెంకటరెడ్డి తన శత వసంత (100) పుట్టిన రోజు వేడుకలు మంగళవారం తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్.. వెంకటరెడ్డికి కేక్ తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ వెంకటరెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా
- ఏటూరునాగారంలో జోనల్ క్రీడలు ప్రారంభం

ఏటూరునాగారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పీఓ చిత్రామిశ్రా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొమురం భీం స్టేడియంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల గిరిజన విద్యార్థులకు జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడలను పీఓ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు రోజూ విద్యార్థులతో వ్యాయామం చేయించాలన్నారు. కార్యక్రమంలో డీడీ పోచం, డీటీడీఓ సైదాన్, ఏటీడీఓలు దేశిరాం, క్షేత్రయ్య, ఏసీఎంఓ రవీందర్, ఏఓ పరశురాములు, ఎస్‌ఓ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ అధికారులు మోహన్‌నాయక్, శరత్, కొమ్మాలు, వజ్జనారాయణ, భాస్కర్, శ్యామలత, కిష్టు, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, శ్రీనివాస్, రేవతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: విద్యార్థి దశ నుంచే సమాజ సేవలో భాగస్వాములు కావాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం యూనివర్సిటీ క్యాంపస్‌లోని బయోటెక్నాలజీ విభాగం, ఫిజికల్‌ఎడ్యుకేషన్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) యూనిట్లను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమ చదువుతోపాటు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుగా సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, కేయూ ఎన్‌ఎస్‌ఎస్‌కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, కుమారస్వామి, బయోటెక్నాలజీ విభాగం అధిపతి తాడూరిశాస్త్రి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య పాల్గొన్నారు.



ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- ఓఇంటిపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు
- విటుడు, నిర్వాహకులపై కేసు నమోదు

ఖిలా వరంగల్: హైటెక్ వ్యభిచార ముఠా నిర్వాకం గుట్టు రట్టయ్యింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు, మామునూరు పోలీసుల సంయుక్తంగా మంగళవారం సాయంత్రం ఓ ఇంటిపై నిర్వహించిన దాడిలో ఇద్దరు నిర్వాహకులతో పాటు ఒక విటుడు పట్టుపడినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు హనుమాన్ నగర్‌లో పెరుమండ్ల రాజీవ్ అనే వ్యక్తి ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వాహన డ్రైవర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించడానికి ఇస్లావత్ సునిత అనే మహిళతో కలిసి వ్యభిచార వృత్తిని ఎంచుకున్నాడు. తనకున్న పరిచయాలతో గత ఏడాదిగా ఇతర జిల్లాల నుంచి మహిళలను రప్పించి ఎవరికీ అనుమానం రాకుండా వ్యభిచారం చేయిస్తున్నాడు. ఈక్రమంలో హనుమకొండ శాయంపేటకు చెందిన గాలి పురుషోత్తం ఓ మహిళతో ఒప్పందం కుదుర్చుకుని మంగళవారం సాయంత్రం వ్యభిచారం చేస్తున్నాడు. ఈక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు పక్కా సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్, మామునూరు పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. బాధిత మహిళలను కాపాడి విటుడు గాలిపురుషోత్తంతోపాటు ఆర్గనైజర్ పెరుమాండ్ల రాజీవ్(31), ఇస్లావత్ సునితను రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మామునూరు పోలీసులకు కేసును అప్పగించినట్లు టాక్స్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. దాడిలో ఆర్‌ఎస్సై భాను ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయి.. దొంగగా మారి

- కమిషనరేట్ పరిధిలో 17 చోరీలకు పాల్పడిన దొంగ అరెస్ట్
- 334 గ్రాముల బంగారం, 1.640 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం

వరంగల్ క్రైం: బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయిన ఓ వ్యక్తి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగగా మారాడు. ఇందులో భాగంగా పగలు తాళం వేసిన ఇళ్ల పరిసరాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి చోరీలకు పాల్పడుతున్నాడు. ఇలా కమిషనరేట్ పరిధిలో పలు చోట్ల చోరీలకు పాల్పడుతున్న దొంగను సీసీఎస్, కేయూ పోలీసులు సంయుక్తంగా మంగళవారం అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. నిందితుడి నుంచి సుమారు రూ.28.50 లక్షల విలువైన 334 గ్రాముల బంగారు, కిలో 640 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.13వేల నగదు, ఒక ద్విచక్రవాహనం, ఒక సెల్‌ఫోన్, చోరీలకు ఉపయోగించే వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ మే రకు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన కొండపల్లి ధర్మరాజు ప్రస్తుతం హనుమకొండ పోస్టల్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం కొంతకాల రాయపర్తి మండల కేంద్రంలో బిర్యానీ సెంటర్ నిర్వహించి నష్టపోయాడు. అనంతరం చదువుకుంటున్నానని చెప్పి హనుమకొండ పోస్టల్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు దిగాడు. నష్టపోయిన డబ్బును తిరిగి పొందేందుకు వివిధ మార్గాల్లో వ్యక్తిగత రుణాలు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొన్నాడు. ఇందులో మరింత నష్టపోయి తీసుకున్న రుణాలకు వాయిదాలు చెల్లించలేక పూర్తిగా అప్పులపాలయ్యాడు. దీంతో తన అప్పులు తీర్చడంతోపాటు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా పగలు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి ఆ ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇలా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 17 చోరీలకు పాల్పడ్డాడు. ఈ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి అత్యాధునిక టెక్నాలజీతో నిందితుడుని గుర్తించడంతో పాటు అతడిపై నిఘా పెట్టారు. నిందితుడు తాను చోరీ చేసిన చోరీ సొత్తు విక్రయించేందుకు కేయూ వైపునకు వస్తున్నట్లు సమాచారం రావడంతో సీసీఎస్, కేయూ పోలీసులు సంయుక్తంగా కేయూ క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తన నేరాలు అంగీకరించాడు. దీంతో అతడి నుంచి పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారని సీపీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

స్త్రీవాదులు పురుషులను శత్రువులుగా చూడొద్దు



మాట్లాడుతున్న కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్

- కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నవీన్

విద్యారణ్యపురి: స్త్రీవాదులు పురుషులను తమ శత్రువులుగా చూడొద్దని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్యనవీన్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి 'తెలుగులో స్త్రీల కథాసాహిత్య ధోరణులు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది.ఈ ముగింపు సభలో అంపశయ్యనవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు పురుషులే ఎక్కువ స్త్రీ కథలు రాసేవారన్నారు. అయితే ప్రస్తుతం అనాదిగా ఎదుర్కొంటున్న తమ అనేక సమస్యలపై స్త్రీలే స్త్రీల కథలు రాస్తున్నారన్నారు. పురుషులు, స్త్రీలు సమానం అనే భావనతో పురుషులు కాని స్త్రీలు కూడా ఆదిశగానే కథలు రాయాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వంగరి త్రివేణి మాట్లాడుతూ బండారుఅచ్చమాంబ మొదలు.. నేటితరం వరకు ఉన్న జూపాక సుభద్ర, కుప్పిలి పద్మ తదితర ఎంతోమంది స్త్రీ కథారచయిత్రులు స్త్రీల సమస్యలపై తమ రచనలు కొనసాగించి సమాజాన్ని చైతన్యపరిచారన్నారు. తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాములు, ప్రముఖ కవి, రచయిత ఆర్.సీతారామారావు, సదస్సు కన్వీనర్ మధు మాట్లాడారు. ఈజాతీయ సదస్సులో 80 పరిశోధన పత్రాలు సమర్పించారు. కళాశాలప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షత వహించిన ఈ సభలో వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని,ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సురేశ్‌బాబు,అకడమిక్ కోఆర్డినేటర్ అరుణ, అధ్యాపకురాలు హెప్సిబా, లక్ష్మీకాంతం, రామరత్నమాల పాల్గొన్నారు.

జనరల్ స్టోర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

- రూ.47.65 లక్షల విలువైన బాణసంచా సీజ్
- ఇద్దరిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: అక్రమంగా బాణసంచా నిల్వ చేసిన ఓ బేకరీ అండ్ జనరల్ స్టోర్‌పై టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వాహించారు. ఈదాడుల్లో సుమారు రూ.47,65,775ల విలువైన బాణసంచా సీజ్ చేసి, ఇద్దరి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వరంగల్ శాకరాశికుంట శాంతినగర్‌లో ఎస్‌ఆర్ బేకరీ అండ్ జనరల్ స్టోర్ నిర్వాహకులు మంచాల లక్ష్మీ ప్రసన్న, మంచాల శ్రీమాన్ నారాయణ అనుమతి లేకుండా బాణ సంచా నిల్వ చేశారని వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం ఉదయాన్నే మంచాల లక్ష్మీ ప్రసన్న, మంచాల శ్రీమాన్ నారాయణ అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచిన ఎస్‌ఆర్ బేకరీ అండ్ కిరాణాషాపుపై ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు చేశారు. సుమారు రూ. 47,65,775ల విలువైన బాణసంచాను సీజ్ చేశారు. అనంతరం ఇద్దరు నిర్వాహకులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు.



సీజ్ చేసిన బాణసంచా నిల్వలను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు

వరంగల్ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు



వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులు సెలవు ఉందని, ఈ సమయంలో యార్డుల్లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ దీపావళి పండుగ(గురువారం), 1వ తేదీ అమావాస్య(శుక్రవారం), 2న వారాంతపు యార్డు బంద్ (శనివారం), 3న వారాంతపు సెలవు(ఆదివారం) ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు, హమాలీలు సరుకులు తీసుకురావొద్దని కోరారు. మార్కెట్ 4వ తేదీ సోమవారం పునఃప్రారంభమతుందన్నారు.

పింఛన్ తీసుకొని వస్తూ మృత్యుఒడికి..

- కారు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం
- కోమల్ల వద్ద ఘటన

రఘునాథపల్లి: పింఛన్ తీసుకొని వస్తున్న ఓ వృద్ధురాలిని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె దుర్మరణం చెందింది. ఈ ఘటన హనుమకొండ- హైదరాబాద్ జాతీయ రహదారిపై కోమల్ల వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోమల్ల శివారు చింతలగూడేనికి చెందిన కొడిపెల్లి లక్ష్మి (85) మంగళవారం గ్రామంలో పింఛన్ తీసుకుని గ్రామానికి చెందిన బండి భారతమ్మతో కలిసి ఇంటికి వస్తోంది. మార్గమధ్యలోని జాతీయ రహదారిని ఇరువురు దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న కారు వారిని ఢీకొంది. దీంతో లక్ష్మి, భారతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మి మృతి చెందింది. భారతమ్మ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు కొడిపెల్లి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ బానోత్ సునీల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.